క్లుప్తంగా

విజయగణపతికి ప్రత్యేక అలంకరణ



పూజలందుకుంటున్న విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి



మానవధర్మం పుస్తకాలు అందజేస్తున్న ఆశ్రమ ప్రతినిధి

లావేరు: విద్యార్థులు మంచి మార్గంలో పయనించాలని లావేరు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం మీసాల శ్రీనివాసరావు అన్నారు. హర్యానా రాష్ట్రం బర్వాలా జిల్లా హిసార్ ప్రాంతంలోని సత్యలోక ఆశ్రమ నిర్వాహకులు మానవధర్మం బోధిస్తూ ముద్రించిన పుస్తకాలను మంగళవారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ పీడీ రవికుమార్, ఆశ్రమ ప్రతినిధులు, పాల్గొన్నారు.

మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలుకు వేలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలుకు బహిరంగ వేలం వేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి వరకు ఏడాది పాటు ఆశీలు వసూలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్కెట్, రోడ్డు మార్జిన్‌లో ఏడు విలీన పంచాయతీలను కలిపి వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు రూ. 10 లక్షలు సాల్వెన్సీ, రూ.3 లక్షలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న టీటీడీ ప్రధానార్చకులు



వేణుగోపాల దీక్షితులుకు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ, మాధవరావుశర్మ, సూర్య నమస్కారాల పండితులు భాస్కరభట్ల రామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంఆర్‌కె దాస్

శ్రీకాకుళం అర్బన్: జాతీయ అంధత్వ, దృష్టి లోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళం హెచ్‌బీ కాలనీ టీపీఎం పాఠశాలలో 425 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ దృష్టిలోపంతో ఉన్న 72 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. విద్యార్థులకు 'కంటి ఆరోగ్యం- సంరక్షణ'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖరరావు, బి.వి.రమణమూర్తి, కె.అప్పన్నదాసు, ఆరోగ్య కార్యకర్త జి.అమ్మాయి, ఆశా కార్యకర్త కె.ఇందిరాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- సార్వత్రిక ఎన్నికల లక్ష్యంగా ముందుకు సాగాలి
- గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ప్రచార సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



హాజరైన నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలనపై ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. పొన్నాడలో మంగళవారం పొన్నాడ-1, పొన్నాడ-2, కొత్తపేట, దోమాం, ముద్దాడ, కొంగరాం, బొంతలకోడూరు, ధర్మవరం, భగీరథపురం, డి.మత్స్యలేశం, కొయ్యాం, బడివానిపేట, అజ్జరాం, కుప్పిలి, బుడగుట్లపాలెం గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ మంగళవారం నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రచార సామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా కన్వీనర్లు, గృహ సారథులకు పంచాయతీల వారీగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరిస్తుండగా అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నిరంతరం ప్రజల్లో ఉండాలని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ పింఛన్ కానుక, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, రైతు భరోసా ఇలా ప్రతి పథకం అర్హులకు చేరుతోందని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీలు, దళారులు ఉండేవారని, ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు ప్రజల ఖాతాలకు నేరుగా చేరుతున్నాయని వివరించారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. గత పాలన, ప్రస్తుత పాలనను ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, ప్రజాస్వామ్యంలో మంచి చేసే పాలకులకే ప్రజలు ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మూడి శ్రీరాములు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, సర్పంచ్ నేతింటి యమున, నాయకులు, ప్రజా ప్రతినిధులు మాడుగుల మురళీధర్‌బాబా, బోర సాయిరాంరెడ్డి, నేతింటి నీలమప్పడు, అల్లు తులసమ్మ, పప్పల రాజేశ్వరి, పంచిరెడ్డి రాంబాబు, అల్లు కన్నబాబు, గుండ రవి, ముద్దాడ శంకరరావు, మూగి ఈక్షిత, మాడుగుల జగదీష్, బోర గోవిందరెడ్డి, మజ్జి జగదీష, కొమర సోమయ్య, చోడిపల్లి వలసమ్మ, కునుకు కన్నప్పడు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి



శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఆర్టీసీ జేఏసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పనిభారాన్ని వెంటనే తగ్గించాలని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు కె.బాబూరావు, ఆర్టీసీ వైఎస్సార్ ఈయూ ప్రతినిధి పి.నవీన్‌బాబులు మాట్లాడుతూ రెండో డిపోలో డ్రైవర్లు, కండక్టర్లపై పనిభారం పెంచి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని చెప్పారు. అలవెన్సులు మాత్రం చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులతో బలవంతంగా ఓటీలు చేయిస్తున్నారని, సెలవులు మంజూరు చేయడం లేదని చెప్పారు. తక్షణమే న్యాయం చేయాలని కోరారు. నిరాహారదీక్షలో జేఏసీ ప్రతినిధులు కె.సూర్యప్రకాశరావు, పి.జోగినాయుడు, బి.శేషుబాబు, కె.అక్కప్పడు, జి.రాజారావు, జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాభివృద్ధి



వర్మీ కంపోస్టు తయారీని వివరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పంతోనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతోందని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్ అన్నారు. రాగోలులోని చెత్తసేకరణ కేంద్రం(ఎల్‌టీపీ)లో మంగళవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో చెత్త ద్వారా సంపద సృష్టించుకోవాలన్నారు. తడిచెత్తను, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తదుపరి వాటిని రీసైక్లింగ్ చేయాలన్నారు. అనంతరం సారవకోట, లావేరు, కంచిలి, నందిగాం, శ్రీకాకుళం క్లాప్‌మిత్రాలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ రాజు, ఈఓపీఆర్‌డీ నిశ్చల, ఎంపీడీఓ రఘు, సూర్యనారాయణ, పంచాయతీ సర్పంచ్ గేదెల చెంగల్వరావు, పంచాయతీ సెక్రటరీ తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావుకు అభినందనలు



డాక్టర్ ఎన్ని సూర్యారావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన సీనియర్ న్యాయవాది ఎన్ని సూర్యారావును జిల్లా బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఓ హోటల్లో ఘనంగా సత్కరించారు. పేదలకు అన్నదానం, కరోనా సమయంలో పేదలకు సాయం చేయడం వంటి కార్యక్రమాలకు గాను ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించింది. కార్యక్రమంలో బీసీ న్యాయవాదులు అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కూన అన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల తల్లి రమాబాయి అంబేడ్కర్



రమాబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఏఐఎం నాయకులు

శ్రీకాకుళం అర్బన్: త్యాగాల తల్లి రమాబాయి అంబేడ్కర్ అని పలువురు ప్రతినిధులు కొనియాడారు. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ విభాగం కన్వీనర్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలోని మహాత్మజ్యోతిరావు పూలే పార్క్‌లో ఉన్న రమాభాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో పగడాలమ్మ

టెక్కలి రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులైన ఎల్‌కేజీ, యూకేజీ చదివే విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో బుధవారం సాయంత్రంలోగా అప్‌లోడ్ చేయా లని డీఈవో జి.పగడాలమ్మ అధికారులను ఆదేశించారు. టెక్కలి మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఆర్పీలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి వెబ్‌సైట్‌లో చిన్నారుల వివరాలు నమోదు చేస్తున్నారో లేదో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఈశ్వరప్రసాద్ సూపరింటెంటెంట్ ఐటీ సెల్ ఏఎస్‌వో పోలేశ్వరరావు, ఎంఈవో డి.నాగభూషణరావు ఉన్నారు.

దుక్కవానిపేటలో గడ్డివాము దగ్ధం

వజ్రపుకొత్తూరు: దుక్కవానిపేటలో సోమవారం అర్ధరాత్రి దాటాక రైతు అవగాన లింగరాజుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని రైతు అనుమానం వ్యక్తం చేశారు. వజ్రపుకొత్తూరు పోలీసులకు రైతు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై వై.మధుసూదనరావు మంగళవారం పరిశీలించారు.

శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామదాసుపేట గ్రామస్తులు

రణస్థలం: రణస్థలం పంచాయతీ రామదాసుపేటకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని సర్పంచ్ పిన్నింటి బానోజీనాయుడు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ వారంలోగా స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తామాడ మోడల్ స్కూల్‌లో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

లావేరు: ఆధార్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తామాడ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.డేనియల్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం తామాడ మోడల్ స్కూల్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆధార్ సమస్యలు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లోనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

లావేరు: ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా చేపట్టాలని ఏపీఓ ఆర్.సత్యవతి అన్నారు. కేశవరాయునిపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. గిట్టుబాటు వేతనాలు రావాలంటే ప్రతి రోజూ రెండు పూటలా ఉపాధి పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తామన్నారు. మస్టర్లను సక్రమంగా వేయాలని మేట్లకు సూచించారు.

రిమ్స్‌లో ఏఓ సంతకం ఫోర్జరీ

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్యకళాశాలలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఒకరు ఏఓ సంతకాన్ని ఫోర్జరీ చేయడం తాజాగా వెలుగులోకి వచ్చింది. బ్యాంక్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న ఆమె శాలరీ సర్టిఫికెట్‌పై ఏఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంక్‌కు సమర్పించింది. జీతం ఎక్కువగా ఉండడం, శాలరీ సర్టిఫికెట్ సాధారణంగా ఉండడం కాకుండా ప్రభుత్వ చిహ్నంతో ఉండటంతో బ్యాంక్ అధికారులకు అనుమానం వచ్చింది. పరిశీలన నిమిత్తం రిమ్స్‌కు పంపించగా ఫోర్జరీ సంతకంతో నకిలీదిగా తేలింది. దీంతో ఏఓ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం దీనిపై విచారణ జరిగే అవకాశం ఉంది. విషయాన్ని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రసన్నకుమార్‌వద్ద ప్రస్తావించగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సూపరింటెండెంట్ అత్యవసర పనిపై విజయనగరం వెళ్లడం వల్ల విచారణ చేపట్టలేకపోయామని, బుధవారం విచారణ చేస్తామని చెప్పారు.

ప్రభుత్వంలో విలీనంతో లాభాల్లో ఆర్టీసీ



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటి నుంచి సంస్థ లాభాల్లో నడుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో దమ్ము శ్రీను అనే వ్యక్తి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చిన నూతన ఆర్టీసీ బస్సును అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, సౌకర్యవంతమని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్టీసీ-2 డిపో మేనేజర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్ గంగరాజు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు కరిమజ్జి భాస్కరరావు, పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, ఇడదాసుల తిరుపతిరాజు, టీకిబ్రహ్మాజీ, జేని లక్ష్మణ, మింద్రాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



మంత్రి ధర్మానను కలిసిన బావాజీమఠం గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: బలగ, బావాజీమఠం పరిసర ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి వాటి స్థానంలో కాలువలు, రోడ్ల మరమ్మతులు చేయించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. మంగళవారం బలగ, బావాజీమఠం పరిసర ప్రాంతంలో నివసిస్తున్న పలువురు మంత్రి ధర్మానను కలిసి సమస్య విన్నవించారు. కొన్ని నెలలు క్రితం ఇదే ప్రాంతంలో 320 మీటర్ల కాలువ, 220 మీటర్ల రోడ్డు మంజూరు చేయగా కొంత పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు చేస్తుండగా బావాజీమఠంలో నివశిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలకు పూనుకొని ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఆక్రమణలు తొలగింపజేయాలని కోరారు.

సంక్షేమం వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ.. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం జాడ గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అందరి మేలు కోరే జగనన్నకు మరోమారు దీవించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావిస్తూ సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి డోల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, కొర్రాయి అప్పారావు, ఇజ్జి కోటి, కోరాడ కేశవరావు, ఇజ్జి శ్రీనివాసరావు, చిక్కాల ధర్మారావు, కోరాడ అచ్చెరావు, పెద్ది లక్ష్మణరావు, పోతిరెడ్డి మాధవరావు, ఇజ్జి ఆదినారాయణ, ఇజ్జి తాతారావు, బాలి అప్పలసూరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పూజారి రామ్మోహనరావు, పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరి, పొట్నూరు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సంచార భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం సంచార భవన్ వద్ద ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్స్ ప్రతినిధులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమానంగా కిందిస్థాయి ఉద్యోగులకు కూడా ప్రతి ఐదేళ్లకు పదోన్నతులు కల్పించాలని, సంస్థలో 4జీ, 5జీ సేవలు వెంటనే ప్రారంభించాలని, జనవరి 1, 2017 నుంచి 15శాతం ఫిట్‌మెంట్‌తో పాటు 3వ వేతన సవరణ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్స్ ప్రతినిధులు పోలాకి వెంకటరావు, ఎం.గోవర్ధనరావు, ఎస్.అభిమన్యు, యూ.సురేష్, ఏఐబీడీపీఏ నాయకులు హెచ్.తేజేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, కె.గోపాలరావు, రాజేశ్వరరావు, ఆర్.నాగమణి, తపాలాశాఖ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు భేష్



సంక్షేమ, అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జి.సిగడాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర బృందం సభ్యులు గిరిజా విజయ్‌శంకర్ పాడి, సత్యరాజ్ రౌతు అన్నారు. మంగళవారం జగన్నాథవలస, ఎస్.పి.ఆర్.పురం గ్రామాల్లో పర్యటించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, సచివాలయాల పనితీరు, రైతుభరోసా కేంద్రాలు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంశక్తి సంఘాల పనితీరుపై ఆరా తీశారు. ఉపాధి పనుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టిబాబు, గృహనిర్మాణ శాఖ పీడీ నక్క గణపతి, ఏపీడీ శైలజ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పూజారి రామ్మోహనరావు, ఏఈఈ మహదాస్యం రమేష్, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, పంచాయతీ కార్యదర్శి పతివాడ భవాని, గౌరీశ్వరి, నాయకులు మీసాల వెంకటరమణ, కాయల రమణ, సర్పంచులు కంది రమాదేవి, బాణాన సూర్యనారాయణ, పెద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యేసయ్య విమోచన పండగలు



భక్తి గీతాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సద్గుణరాజు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో 6వ యేసయ్య విమోచన పండుగలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీస్ అండ్ రిజాయిస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో కంటి వైద్యులు డాక్టర్ కె.సద్గుణరాజు 'క్రైస్తవ భక్తి గీతాల' పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని స్తుతి ఎంతో గొప్పదని, దాన్ని అందరూ పాటించాలని కోరారు. క్వాయిర్ బృందం భక్తి గీతాలను ఆలపించగా.. కాకినాడకు చెందిన బిషప్ నటరాజన్ లాజరస్ దైవ వర్తమానం అందించారు. పాస్టర్ చల్లా కరుణాకర్ మాట్లాడుతూ దేవున్ని నిత్యం తమ గీతాల ద్వారా స్తుతి చేసేందుకు ఈ పుస్తకాన్ని రూపొందించామని చెప్పారు. మరో రెండురోజులు సభలు జరుగుతాయని, అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, ఎస్తేరు రాణి, కొర్నేలి, జి.సైమన్, ఆర్.పౌలు తదితరులు న్నారు.

బీఎల్ఓలు అంకితభావంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు

జి.సిగడాం: బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ)లు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్‌కార్డులను ఆధార్ నంబర్లతో అనుసంధానం చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ అధికారి ఎన్నికల అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో డీటీ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ పన్నుపై అవగాహన

కాశీబుగ్గ: పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ (పీసీఎంఏ) భవనంలో ఆదాయ పన్ను అధికారులు జీడి పరిశ్రమలదారులకు టీడీఎస్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. సంఘ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఆదాయ పన్ను డిప్యూటీ కమిషనర్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. పన్ను చెల్లింపుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆదాయపన్ను అధికారి కె.బాబ్జీ, లోకల్ ఆడిటర్స్ పి.వి.సతీష్, సంజీత్, మనీల్, రవితేజ, పీసీఎంఏ కార్యదర్శి కె.వి.శివక్రిష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి టి.శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.